ప్రజాశక్తి
బుధవారం 05 మార్చి 2025

వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద పార చేతపట్టి మట్టిని తవ్వుతున్న కలెక్టర్

దద్దరిల్లిన కల్లూరు తహశీల్దార్ కార్యాలయం

- ఇళ్ల స్థలాల కోసం కార్యాలయం ఎదుట మహిళలు బైఠాయింపు - దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మంగళవారం కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ముట్టడిలో నినాదాలతో కార్యాలయం ఆవరణం హోరెత్తింది. కల్లూరు మండలం పరిధిలోని పెద్దపాడు గ్రామ శివారులో సిపిఎం చేపట్టిన భూ పోరాటం మంగళవారం రెండో రోజు కొనసాగింది. మొదటి రోజు కల్లూరు తహశీల్దారు పేదలకు న్యాయం చేస్తాం, దరఖాస్తులు ఇవ్వండి అని ఇచ్చిన హామీ మేరకు రెండవ రోజు కర్నూలు నగరంలోని వేలాదిమంది పేదలు దరఖాస్తులు తీసుకొని భూమి వద్దకు చేరుకొని సిపిఎం నాయకులకు ఇచ్చేందుకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఓవైపు అధికారులు హామీ ఇస్తూనే సదరు భూముల్లో నుంచి వెళ్లిపోవాలంటూ భారీ ఎత్తున పోలీసులు బలగాలు మోహరించారు. పేదలను అక్కడి నుండి బలవంతంగా ఒత్తిడి చేస్తూ దరఖాస్తులు సేకరించడాన్ని ఆటంకపరుస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లిపోవాలని ఒత్తిడి చేసి వెళ్లగొట్టారు. కనీసం దరఖాస్తులు స్వీకరించేందుకు ఆయనా సమయం ఇవ్వకుండానే పేదలను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంటి బిడ్డలతో మండుటెండల్లో వచ్చిన మహిళలు అక్కడి నుండి దరఖాస్తులతో ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకొన్నారు. సిపిఎం నాయకులు పేదలతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం ముంగిట బైఠాయించి పేదలకు వెంటనే ఇంటి స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని, తాసిల్దారు దరఖాస్తులు స్వీకరించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. తహశీల్దార్ స్థానికంగా లేకపోవడంతో డిప్యూటీ తహశీల్దారు, వీఆర్వోలు బయటికి వచ్చి దరఖాస్తులను స్వీకరించారు. అంతకుముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇస్తానని ఇచ్చిన హామీ మేరకే పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తాము కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిఐటియు రాధాకృష్ణ, పి.నిర్మల, టి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, అబివేలమ్మ, గురు శేఖర్, రామకృష్ణ, నరసింహులు, శ్రీనివాసులు, సుధాకరప్ప, రఫీ, ప్రభాకర్, భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రభుత్వ స్థలం వద్దకు చంటి పిల్లలతో వచ్చిన పేద ముస్లిం మహిళలు

ప్రభుత్వ స్థలం వద్దకు చేరుకున్న మహిళలు

పార చేతపట్టి.. మట్టి తవ్విన కలెక్టర్

- అల్లుగుండులో ఉపాధి కూలీలతో కలెక్టర్ పి.రంజిత్ బాషా

- జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించండి

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పారచేత పట్టి కూలీలతో కలిసి మట్టి తవ్వారు. ఉపాధి కూలీలతో కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. ప్రతి రోజు ఎంత పని చేస్తున్నారు..? పనికి తగ్గ కూలీ వస్తుందా..? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఉపాధి పనుల డబ్బులను మంజూరు చేయిస్తామని కూలీలకు కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడి నుండి ఎక్కడి వరకు చేయిస్తున్నారని, ఎంతమంది పనులకు హాజ రయ్యారని కలెక్టర్ మస్టర్ డేటా ద్వారా వెరిఫై చేశారు. వేతనాలు ఎంత ఇస్తున్నారు..? వేతనాలు ఇచ్చినట్లు కూలీలకు రసీదులు ఇస్తున్నారా అని కలెక్టర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనుండడంతో కూలీలకు ఉపాధి పనులను కల్పించడంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ డ్వామా పీడీని, అధికారులను ఆదేశించారు. **తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ:** వెల్దుర్తిలోని తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సమస్యలను ఎంతవరకు పరిష్కారం చేశారని కలెక్టర్ అధికారులను అడిగారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను, వీఆర్ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్, డ్వామా పీడీ వెంకట రమణయ్య, తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఏపీవో లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

క్లస్టర్ వర్సిటీకి మరింత ప్రాధాన్యత

- విసి సాయి గోపాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ వర్సిటీకి రాబోయే రోజుల్లో మరింత ప్రాధాన్యత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైందని వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. మంగళవారం క్లస్టర్ వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల సమావేశ భవనంలో వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయిగోపాల్ వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వివి సుబ్రమణ్య కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సాయిగోపాల్ మాట్లాడుతూ వర్సిటీని నాలుగు సంవత్సరాల పాటు అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. జగన్నాథ గట్టు సమీపంలో నిర్మిస్తున్న వర్సిటీ భవనాలు కూడా త్వరలోనే పూర్తి అవుతాయని పేర్కొన్నారు. త్వరలోనే టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వర్సిటీ అభివద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పాటు సాయి గోపాల్ వైస్ ఛాన్సలర్‌గా ఎనలేని సేవలను అందించాలని కొని యాడారు. అనంతరం నాలో నేను పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్, రాయలసీమ వర్సిటీల రిజిస్ట్రార్లు కట్ట వెంకటేశ్వర్లు, విజయకుమార్ నాయుడు, మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, తెలుగు భాషా వికాస ఉద్యమం నాయకులు జెఎస్ఆర్కే శర్మలు పాల్గొన్నారు.

విసి సాయి గోపాల్‌ను సన్మానిస్తున్న అతిథులు

6న ఛలో విజయవాడ

- మహాధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు, ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి - గూడూరు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ తెలిపారు. మంగళవారం గూడూరులో ఆశా డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాధవి, శేషమ్మలు మాట్లాడుతూ... గత సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన సమ్మె సందర్భంగా అధికారులు, పాలకులు ఆశా వర్కర్లతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. తెలుగుదేశం కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోగా వారితో వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. బడ్జెట్‌లో కూడా స్కీం వర్కర్లకి ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగానే ఆశా వర్కర్లకు వేతనాలు ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పదిలక్షలు చేయాలని, ఎన్సీడీసీ సర్వే ఆశ వర్కర్లతో చేయించరాదని తదితర సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 6న విజయవాడలో జరుగు మహాధర్నాలో ఆశ వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఆదిలక్ష్మి, గిరిజ, వరలక్ష్మి, మునిరాబాను, సావిత్రి, ఆరిఫా బి, మనోహరమ్మ, పద్మమ్మ తదితర ఆశ వర్కర్లు పాల్గొన్నారు, **తుగ్గలి :** ఆశాల సమస్యలపై ఈ నెల 6న విజయవాడలో నిర్వహించే మహా ధర్నాకు ఆశాలు పెద్ద ఎత్తున కదలిరావాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు కోరారు. తుగ్గలి, పగిడి రాయి ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. **సి బెళగల్ :** ఆశాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ డివిజన్ నాయకులు మోహన్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శి శైలజ, లక్ష్మీకాంతమ్మ ల సమక్షంలో ఆశా డే నిర్వహించి ఆయన మాట్లాడారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతి అందజేశారు. **కోడుమూరు రూరల్ :** ఈ నెల 6న చలో విజయవాడకు వెళుతున్నామని లద్దగిరి పిఎస్‌సి మెడికల్ ఆఫీసర్ భాస్కర్, మదన్ శేఖర్‌కి సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న, ఆశా వర్కర్స్‌యూనియన్ నాయకులు సుబేదా, ఆశ వర్కర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. సువర్చల. అరుణ, సరోజ, రేణుక, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆశా వర్కర్లు

తాగునీటి సమస్య తలెత్తరాదు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి అంశం అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ఇందుకు సంబంధించి ప్రతికూల వార్త ఏది వచ్చినా, మండల స్పెషల్ ఆఫీసర్‌ను అడుగుతానని హెచ్చరించారు. వచ్చే మూడు నెలల్లో మండల స్పెషల్ ఆఫీసర్‌లు తాగునీటి సమస్య మీద ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా మండలాల పరిధిలోని అన్ని గ్రామాలను మండల స్పెషల్ ఆఫీసర్లు వెంటనే సందర్శించి, అక్కడ తాగునీటి పరిస్థితులను గురించి పరిశీలించాలన్నారు.. చిన్నచిన్న మరమ్మతులు ఉంటే 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో మరమ్మతులు చేయించాలన్నారు. సిపిడబ్ల్యుఎస్ స్కీమ్స్‌కు సంబంధించి మండల నిధులు లేదా జిల్లా పరిషత్ నిధులతో మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఏ సోర్స్ లేకపోతే ట్రాన్స్పోర్టేషన్‌కు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి మండల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇప్పటివరకు రోజూ 68 వేల మందికి మాత్రమే పనులు కల్పించామని, రోజూ లక్ష మందికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ మూడు నెలలు వేరే పనులు ఉండవు కాబట్టి, జాబ్ కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఆదోని, పెద్ద కడుబూరు, కోసిగి, కౌతాళం, పత్తికొండ, తుగ్గలి మండలాలు పని కల్పించడంలో వెనుకబడి ఉన్నారని, ఆయా మండలాల ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించి పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎమ్ఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు వెంటనే భూమిని గుర్తించి నివేదిక పంపాలని సూచించారు. ఎంఎస్ఎంఈ సర్వేను ఈ ఈవారం ఆఖరిలోపు పూర్తి చేయాలని తెలిపారు. సర్వేకి సంబంధించి పెండింగ్ ఉన్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పి 4 సర్వేలో మంత్రాలయం, కౌతాళం, నందవరం మండలాలు వెనుకబడి ఉన్నాయని, త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలన్నారు. 16 మండలాలు 90 శాతం పైన, మిగిలిన 7 మండలాలు 80 శాతం పైన సర్వే పూర్తి చేశాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జడ్పి సీఈఓ నాసర రెడ్డి, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని చూడి గ్రామంలో డీఎస్పీ ఉపేంద్ర బాబు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ గ్రామంలో చిన్నారిపై లైంగిక దాడి జరిగినట్లు ఫోక్సో కేసు నమోదు కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో బాధితుల ఇంటికెళ్లి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు. సిఐ అశోక్ కుమార్ ఉన్నారు.

విచారణ చేపడుతున్న డీఎస్పీ

9 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని ఉరుకుంద గ్రామానికి చెందిన 9 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సిఐ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఉరుకుంద గ్రామానికి చెందిన శాంత కుమార్ సొంత స్థలం సర్వే కోసం రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామ విఆర్ఎలను పంపించగా, అర్జీదారునితో కలిసి సర్వే చేయడానికి స్థలం వద్దకు వెళ్లారని చెప్పారు. అదే గ్రామానికి చెందిన గట్టూరి హుస్సేని, గట్టూరి హరి, గట్టూరి రమేష్, గట్టూరి హనుమంతు, గట్టూరి ఈరన్న, గట్టూరి గుండయ్య మరో ముగ్గురితో కలిసి కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డారని శాంత కుమార్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అరకొర నిధులతో రాష్ట్ర బడ్జెట్

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగర్జున యాదవ్

ప్రజాశక్తి - తుగ్గలి

కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కేటాయింపులు శూన్యమంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అద్దంకి నాగర్జున యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసి, ఎన్నికల హామీలను గాలికి వదిలేసి మసి పూసి మారేడు కాయ చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడం అరకొరనే అని తెలిపారు. రైతులను నిరీక్షణకు గురి చేయడం అన్యాయమన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. బడ్జెట్ అమలులో జవాబుదారితనం ఉండాలని, అప్పుడే ప్రజలకు బడ్జెట్ వల్ల ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

అంకుర్ సీడ్స్‌నే వాడండి

- ఆర్ఎస్ఎం మనోజ్ రాజు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

రైతులు అంకుర్ సీడ్స్ వాడాలని అంకుర్ సీడ్స్ ఆర్ఎస్ఎమ్ ఎం.మనోజ్ రాజు కోరారు. మంగళవారం క్రిష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామంలో మనోజ్ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంఠ ఆయన మాట్లాడారు. బలమైన గింజలు, నారింజపు రంగు గల గింజలను ఇచ్చే అంకుర్ సీడ్స్ భాస్కర్ గల కంపెనీ రైతులకు మంచి దిగుబడినిచ్చే రకమని తెలిపారు. మొక్కజొన్న ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. ఎ.రాంపాల్ రెడ్డి, పిపిపి బుచ్చిరెడ్డి, రైతులు ఎస్.శ్రీనివాస్ రెడ్డి, జి.రాంపాల్ రెడ్డి, బి.రామాంజనేయులు, జి.కేశవరెడ్డి, జి.ఓంకార్ రెడ్డి, జి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుల గణన చేపట్టాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామచంద్రయ్య

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తెలంగాణ ప్రభుత్వం మాదిరి ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులో ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.కారన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రామచంద్రయ్య హాజరయి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల పేదలు నష్టపోతున్నారని తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ, దేశ సంపదను పెంచుతూ వెనుకబడిన, దళిత, గిరిజన, మైనార్టీలకు దేశ అభివృద్ధిలో ఫలితాలు అందడం లేదని చెప్పారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధిలో, విద్య, వైద్య, ఉపాధి కరువైందని తెలిపారు. బీసీల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే చంద్ర బాబు నాయుడు చిత్తశుద్ధి ఉంటే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, బీసీ, ఎస్సీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా నాయకులు టి.శేషఫణి, సిపిఐ ఎంఎల్ జనశక్తి జిల్లా నాయకులు సుంకన్న, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథ్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మాధవ స్వామి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు నగర నాయకులు విజయకుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న మాట్లాడారు. ఎపి మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.విజయకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నల్లన్న, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జిల్లా ఈశ్వర్, మహమూద్, హోటల్ వర్కర్స్ యూనియన్ టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెరలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో, కుండా కుటుంబం వారి ఆర్థిక సహకారంతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఎంఇఒ ఎం.రంగస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిల్లలకు పరీక్షల పట్ల అవగాహన కల్పించి, పరీక్ష అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం.రంగన్న, విశ్వనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, కుండా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజస్తున్న నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

విద్యార్థినులు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్‌పి విక్రాత్ పాటిల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు మంగళవారం కళాశాలల విద్యార్థినుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిల్లోని ఆయా పోలీసుల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం, ప్రస్తుత సవాళ్లు, మహిళా భద్రత వంటి కీలక అంశాలపై అవగాహన పెంపొందించే విధంగా పోటీలు నిర్వహించారు. మహిళా చట్టాలు, ఫోక్సో ఆక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌పి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు మహిళలలో నైతిక ధైర్యాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పోలీసు శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఎల్లవేళలా పోలీసు సిబ్బంది సహాయ, సహకారాలు ఉంటాయని తెలియజేశారు. మహిళలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్లు చైల్డ్ హెల్ప్ లైన్: 1098, ఉమెన్ హెల్ప్ లైన్: 181,పోలీస్ హెల్ప్ లైన్: 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్: 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 7777877722కు నెంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలియజేశారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యుజెఫ్ ఓర్వకల్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

యునైటెడ్ జర్నలిస్టు ఫోరం ఓర్వకల్లు మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మద్దిలేటి యాదవ్, చిన్న స్వాములు, కోశాధికారిగా కుమారస్వామిలతోపాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాయకులు నీలం సత్యనారాయణ, చంద్రమోహన్, విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు జర్నలిస్టులపై వివక్ష చూపుతున్నాయని అన్నారు. అక్రిడిటేషన్‌లు, విద్యారాయితీ, ఇళ్ల స్థలాలు మంజూరులో కాలయాపన చేయడం బాధాకరం అన్నారు. జర్నలిస్టులు ఐక్యత పాటించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రతి సచివాలయం పరిధిలో వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే ప్రారంభమైందని, నగర ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమీషనరు ఎస్.రవీంద్రబాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 2,73,576 మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నట్లు తెలిసిందని అన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు వచ్చే సచివాలయ ఉద్యోగులకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత వార్డెన్ మృతి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

రోడ్డు ప్రమాదంలో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన విశ్రాంత హాస్టల్ వార్డెన్ కృష్ణారెడ్డి మృతి చెందారు. మంగళవారం కర్నూలు నగరంలో డీమార్ట్ వైపు వాకింగ్‌కు ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో కిందపడ్డారు. అదే సమయంలో వెనకాలే వస్తున్న లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మండలంలోని లద్దగిరి గ్రామంలో హాస్టల్ వార్డెన్‌గా ఆయన విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన కర్నూలులో నివాసం ఉంటున్నారు.

స్కాలర్‌షిప్పులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పొదుపు చేసుకునే మహిళల ఆడపిల్లలు టెన్త్ ఇంటర్ డిగ్రీ 2021 తర్వాత పూర్తి అయిన వారందరూ 3500 స్కాలర్షిప్పుల కోసం అర్హులని మెప్మా సిఎంఎం భాస్కర్ రెడ్డి తెలిపారు. కర్నూలు జిల్లాలో మొత్తం 1250 మందికి ఈ స్కాలర్‌షిప్పులు అందజేయనున్నారు. ఆశ ఫౌండేషన్ మెప్మా ఆధ్వర్యంలో అర్హులైన డిగ్రీ చదివిన అమ్మాయిల వివరాలను అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీం కింద ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలో 500, ఆదోని 300, ఎమ్మిగనూరు 300, గూడూరు 150 మంది చొప్పున నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు.

మంత్రి వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయ ఉద్యమాన్ని అవమానపరిచేలా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి మద్దతు ఇచ్చిన అభ్యర్థి విజయం సాధించడం జరిగింది అన్నారు, తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రత్యక్షంగా మద్దతు నిచ్చిన అభ్యర్థి పరాజయం పాలయ్యారన్నారు "తమ కూటమి ప్రభుత్వం ఇరువురు అభ్యర్థులకు మద్దతునిచ్చి వ్యూహాత్మకంగా వ్యవహరించిందంటూ", వారిలో ఎవరు విజయం సాధించినా ప్రభుత్వ విజయమేనంటూ కపటనాటకానికి తెర లేపడమే గాక, పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతునిచ్చిన యుటిఎఫ్ ను తమ రాజకీయ ప్రత్యర్థి వైకాపాకు ముసుగుగా అభివర్ణిస్తూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని అవమానించడం సరైంది కాదన్నారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలకు పూనుకున్న కూటమి ప్రభుత్వాన్ని ఉపాధ్యాయులు క్షమించరన్నారు. తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన సంఘం యుటిఎఫ్‌ఏనని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు యుటిఎఫ్ తన రెండో ఓటును తెలుగుదేశం అభ్యర్థులకు వేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. తమ రాజకీయ ప్రత్యర్థిని టార్గెట్ చేసేందుకు యుటిఎఫ్ ను వాడుకోవడం మంత్రి స్థాయికి తగదన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, అన్నింటినీ తాము చవి చూశామని, అన్ని సమస్యలకూ పోరాటాలే పరిష్కారమని, ఎన్నికలు ముగిశాయి గనుక కల్లబొల్లి హామీలు ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొండి చేయి చూపుతూ, ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నరన్నారు. ప్రభుత్వానికి తమ పోరాటాలతోనే సమాధానం చెబుతామన్నారు. ఇప్పటికైనా మంత్రి యుటిఎఫ్ కు రాజకీయ దురుద్దేశాలు అంటగడుతూ చేసిన వ్యాఖ్యలను భేషరతుగా ఉపసంహరించుకోవాలని సురేష్ కుమార్ డిమాండ్ చేశారు.

'పది'లో ఉత్తీర్ణత సాధించాలి

- ప్రధానోపాధ్యాయులు సుజాత

ప్రజాశక్తి - ఆలూరు

బహుమతులు అందజేస్తున్న నాయకులు

పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి ఉమేష్ అధ్యక్షతన 'ప్రజ్ఞా వికాసం' పదో తరగతి మోడల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. పరీక్షలు రాసేటప్పుడు ఏమాత్రం భయం వద్దన్నారు. ఉపాధ్యాయులు గిరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, హనుమంతు, ఖాజా పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆస్పరిలో...

దేవనకొండలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే విరుపాక్షి పుట్టినరోజు వేడుకలను జడ్‌పిటిసి కిట్టు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుముంబా, నేలతలమరి హంపిరెడ్డి, రాజారెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి వైసిపి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. వైసిపి నాయకులు కందనాతి రంగన్న, టోపీ యూసుఫ్ బాష, పెద్దోడు, గుండు రంగస్వామి, ఆంజనేయులు, కొత్తపేట బాబు, పల్లెదొడ్డి చంద్రన్న, మల్లికార్జున రెడ్డి, జయన్న పాల్గొన్నారు. **ఆస్పరి**లోని గాంధీ పార్కులో ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల కన్వీనర్ బసవరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జడ్‌పిటిసి దొరబాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి ఆలూరు యూత్ అధ్యక్షులు అశోక్, ఎంపిటిసి రాధాకృష్ణ, నాయకులు పురుషోత్తం రెడ్డి, ప్రకాష్, నాయుడు, మహానంది, కేశవ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చిన్న రెడ్డి, శివ, వీరేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అలసత్వం వద్దు

- పత్తికొండ డివిజన్ ఎంఎస్‌యుఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి మొదలైన నేపథ్యంలో ఏ చిన్న అనారోగ్యానికి గురైనా అలసత్వం వహించకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని డివిజనల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆశా డే సందర్భంగా చిప్పగిరి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ అఫ్రోజ్ జహాన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అరగంటకు ఒకసారి నీరు తీసుకోవాలని సూచించారు. పనులకు వెళ్లేవారు తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, టిబి, గళ్ల పరీక్షలు నిరంతరం కొనసాగుతాయని అవగాహన కల్పించాలన్నారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఎఎన్ఎంలు పద్మవతి, హరి చందన, సువర్ణ, పార్వతి, కృష్ణవేణి, ఆశాలు పాల్గొన్నారు.

'ఎస్ఐ శివాంజల్ సేవలు మరువలేనివి'

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎస్ఐ శివాంజల్ సేవలు మరువలేనివని హనుమాపురం గ్రామస్తులు కొనియాడారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐని కలిసి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ... గతంలో పెద్దకడబూరు మండలంలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన మండల ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రస్తుతం మంత్రాలయంలో విధులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకొని వచ్చినట్లు తెలిపారు. హనుమాపురం గ్రామానికి చెందిన ఈరన్న, వెంకటేష్, వీరేశ్, హుస్సేని, బంగారయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానిస్తున్న ప్రజలు

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

- పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్
- ఏడు చెక్‌పోస్టులు బలోపేతం
- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు
- అసలు సూత్ర ధారి బిజెపి నాయకుడే

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యాన్ని భారీగా చేసుకున్నట్లు, కర్ణాటక మద్యం రవాణా చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, వాహనాన్ని మంగళవారం ఆదోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సిఐలు సైదుల్, జయరాముడు సమక్షంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు నుంచి ఆదోనికి బొలెరో వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టణ శివారులోని మహాయోగి లక్ష్మమ్మ ఆర్చి వద్ద కాపు కాచి పట్టుకున్నామని తెలిపారు. సుమారు 80 బాక్సుల కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దాని విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందన్నారు. ఆదోనికి చెందిన అజయ్ కుమార్, షేక్ సాహిద్‌ను అరెస్టు చేయగా ప్రధాన నిందితుడు వాల్మీకి నగర్‌కు చెందిన నాగిరెడ్డి పరారైనట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లో ఏడు చెక్ పోస్టులు ఉన్నాయని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమ మద్యంపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని తెలిపారు. అక్రమ మద్యం కట్టడి వల్ల రాష్ట్రంలో మద్యం విక్రయం పెరిగిందన్నారు. నాటుసారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపి నవోదయ-2.0 కింద స్థావరాలను ధ్వంసం చేస్తున్నామని తెలిపారు. మద్యం తరలింపు కేసులో ప్రధాన నిందితుడు నాగిరెడ్డి కోసం గాలింపు చేస్తామని, త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు.

ప్రధాన నిందితుడు ఎమ్మెల్యే అనుచరుడే

ఆదోనిలో కర్ణాటక మద్యం ఆదాయ వనరుగా మారింది. గత ప్రభుత్వంలో మద్యంతో సంపాదించిన వ్యక్తులు బిజెపిలో చేరి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కర్ణాటక మద్యం తరలింపు కేసులో పరారీలో ఉన్న నిందితుడు వాల్మీకి నగర్‌కు చెందిన నాగిరెడ్డి బిజెపి నాయకుడని పలువురు చెబుతున్నారు. ఎమ్మెల్యే అనుచరుడు అంటూ కర్ణాటక నుంచి మద్యం దిగుమతి చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఎప్పుడూ తాము నిజాయితీ పరులమంటూ చెప్పుకునే బిజెపి నాయకులు మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగిరెడ్డి పట్ల వారి వైఖరి ఏమిటన్నది ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేసు నుంచి నాగిరెడ్డిని తప్పించాలని పలువురు బిజెపి నాయకులు ఆదోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి మంతనాలు జరిపినట్లు కూడా చెబుతున్నారు. అప్పటికే మద్యం స్వాధీన విషయం ప్రచారం కావడం, ఉన్నతాధికారులకు సమాచారం చేరడంతో తామేమీ చేయలేమని పోలీసులు చేతులెత్తేసినట్లు తెలిసింది. ఆదాయ వనరుగానే పలువురు బిజెపిలో చేరుతున్నట్లు విమర్శలున్నాయి. ఎమ్మెల్యే పార్థసారథి ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇలా అయితే చెడ్డ పేరు వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

మద్యాన్ని చూపుతున్న పోలీసులు

సిబ్బందిపై సర్పంచుల ఫిర్యాదు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై ఎంపిపి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు కలెక్టర్, జడ్‌పి సిఇఒ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు మంగళవారం వివిధ గ్రామాల సర్పంచులు తెలిపారు. పంచాయతీ పరిపాలనకు సంబంధించిన సమాచారాలు, బిల్లుల చెల్లింపుల ప్రక్రియ తదితర వాటి పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని విమర్శించారు. ఆ ఇద్దరి అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపిపితో చర్చించి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

తహశీల్దార్‌పై ఎంపిపి భర్త అసహనం

మాట్లాడుతున్న ఎంపిపి భర్త లుముంబా

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ తహశీల్దార్ ప్రసాద్ రాజుపై ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుముంబా అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన తహశీల్దార్‌ను కలవడానికి వెళ్లినట్లు, తహశీల్దార్‌ను కలవాలని అటెండర్‌తో చెప్పి పంపినట్లు తెలిపారు. కనీసం 'మాట్లాడడానికి రండి' అని కూడా చెప్పకుండా బిజీగా ఉన్నారని అటెండర్‌తో చెప్పించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను చర్చించడానికి కార్యాలయానికి వెళ్లామని, ఇలాంటి సమాధానం చెప్పడం మండల రెవెన్యూ అధికారి తీరు సరైనది కాదని చెప్పారు.

కనులపండువగా 'జోడు' రథోత్సవం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో గురుశిష్యులైన శ్రీసిద్ధలింగేశ్వరస్వామి, గాదిలింగేశ్వరస్వామి వార్ల జోడు రథోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివార్లకు ఆకుపూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గణపతిపూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు, నందికోలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి గండా దీపోత్సవం, కుంభాభిషేకం, పల్లకి సేవ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించి సాయంత్రం 6.30 గంటలకు రథోత్సవాన్ని ఎదురుబసవన్న గుడి వరకు లాగారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్, ఎల్ఎల్‌సి డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ మిక్కిలి నేని శివప్రసాద్, ఆలూరు తాలూకా యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, మండల కన్వీనర్ సుధాకర్ స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎస్ఐ చంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వీనులవిందుగా రాఘవేంద్రుని నామస్మరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నామస్మరణతో భక్తులకు వీనులవిందు కలిగించింది. మంగళవారం భజనమండలి బృందం ఆలపించిన రాఘవేంద్రస్వామి భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. గురువైభవోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీగురుసార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక భజన నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న భజనమండలికి చెందిన దాదాపు 2 వేల మంది సభ్యులు పాల్గొన్నారు. పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు, శ్రీన్యాయసుధా పరీక్ష నిర్వహించారు. శ్రీవ్యాసరాజ మఠం పీఠాధిపతులు శ్రీవిద్యా విజయతీర్థులు, బళ్లారి ఎంపీ ఇ.తుకారాం, బెంగళూరులోని పూర్ణ ప్రజ్ఞా విద్యాపీఠానికి చెందిన శ్రీవిద్వాన్ యు.కేశవాచార్యులు పాల్గొన్నారు.

రామజల.. ఇక తాగునీరు

- గతంలో నీరు కలుషితం
- నాలుగు సార్లు పరీక్షలు
- ఎట్టకేలకు వాడకంలోకి నీరు

ప్రజాశక్తి - ఆదోని

పురాతన కాలం నుంచి ఆదోని ప్రజల దాహార్తి తీర్చిన ఘనత రామజల చెరువుకు ఉంది. 'ఆ నీరు రుచే వేరు' అంటూ ఇప్పటికీ చెబుతారు. అలాంటి చెరువు నీరు మళ్లీ వాడకంలోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరుణ్ జ్యోతి నగర్‌లో దేవర సందర్భంగా నీరు కలుషితమై డయేరియా వ్యాధి బారినపడి అప్పట్లో మరణించిన సంగతి తెలిసిందే. కొందరు ఆస్పత్రి పాలయ్యారు. నాలుగేళ్ల క్రితం నుంచి రామజల చెరువు నీరు వాడకం లేక నిరుపయోగంగా మారింది. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం సరిగా లేకపోవడం, అక్కడ నిల్వ ఉంచిన నీరు ప్రజలకు సరిపోకపోవడం వంటి కారణాలతో రామజల చెరువులోని వ్యర్థాలను తొలగించి వాడకంలోకి తీసుకొచ్చేందుకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు ఇంతియాజ్, రామ్మూర్తి, గోపినాథ్ అహర్నిశలు శ్రమించారు. ఏర్పాట్లకు మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు సహకరించారు. చెరువు పరిసరాలను శుభ్రం చేసి నీటి పంపింగ్‌తో చెరువు కళకళలాడుతోంది.

నాలుగు సార్లు పరీక్షలు

రామజల చెరువు నీటి నమూనాలను నాలుగు సార్లు ల్యాబ్‌లో పరీక్షలకు పంపారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చెరువులోని నీటిని తాగునీటి అవసరాల కోసం సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. గత ఎన్నో దశాబ్దాలుగా పట్టణానికి తాగునీరు అందించిన రామజల నీటిని నాలుగేళ్ల తర్వాత తిరిగే వాడకంలోకి తెచ్చేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగేళ్ల క్రితం కొన్ని సమస్యల వల్ల రామజల నీటిని తాగునీటి కోసం వినియోగించకుండా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఇటీవల ప్రత్యేకంగా నాలుగు సార్లు కర్నూలులోని పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లో వివిధ పరీక్షలు నిర్వహించారు. అనంతరం నీటిని తాగునీటి కోసం వినియోగించవచ్చని నివేదిక వచ్చిందని మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ తెలిపారు. ఇప్పటికే నివేదిక వచ్చి పది రోజులు దాటిందని, త్వరలోనే నీటిని తాగునీటి కోసం వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ప్రస్తుతం రామజల చెరువులో 1,217 మిల్లీలీటర్లకు గాను 750 మిల్లీలీటర్లు నిల్వ ఉందన్నారు. ఈ నీరు పట్టణంలోని ఎంఐజి, ఎల్ఐజి, అరుణ్ జ్యోతి నగర్, ఖానీమహల్, ప్రశాంత్ నగర్ తదితర 8 వార్డుల్లోనే మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా మూడు నెలల పాటు సరఫరా చేయడానికి అవకాశం ఉంది. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో కూడా 3,110 మిల్లీలీటర్లకు గాను 1,800 నిల్వ ఉంది. వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య ఉండదని, ప్రజలకు తాగునీరు అందించేందుకు నీరు నిల్వ చేసుకోవడం జరిగిందని అధికారులు చెబుతున్నారు.

రామజల చెరువు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యల నివారణకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో భ్రూణ హత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించాలని చెప్పారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి రూ.50 వేల జరిమానా నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో 48 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, స్కానింగ్ కేంద్రాన్ని 3 నెలలకోసారి తనిఖీ చేయాలని సూచించారు. నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేయాలన్నారు. డీఎస్పీ హేమలత మాట్లాడుతూ... భ్రూణ హత్య అనేది సమాజానికి కలిగే తీవ్ర అనర్థం మాత్రమే కాకుండా, చట్టపరంగా కూడా నేరమని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ... లింగ నిర్ధారణ చేయరాదని తెలిపారు. సామాజిక అవగాహన పెంచడం, భ్రూణ హత్యల హానికారక ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత, సిడిపిఒలు సఫరున్నీసా బేగం, ఉమా మహేశ్వరి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి

'ఉపాధి' పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 10 వారాల వేతనాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నాగరాజు స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ తిక్కన్న మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారం వారం వేతనాలు చెల్లించి వలసలు ఆపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, రాముడు పాల్గొన్నారు.

వైభవంగా చెంచులక్ష్మి, ఓబులేశ్వర స్వాముల కల్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తొగలగల్లు గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీభూనీళా చెంచులక్ష్మి సమేత శ్రీఓబులేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో వైభవంగా సాగింది. పూజారులు వీర నరసింహయ్య స్వామి, సత్యనారాయణ, లక్ష్మినారాయణ, చెన్నకేశవ, రఘు, రాజగోపాల్ స్వామిలు ఉదయం 9 గంటలకు ఓబులేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 నుంచి 11.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన దొడగొండ, యాటకల్లు, తంగరడోన గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ప్రభావళి నిలబెట్టారు. రాత్రికి నందికోలు సేవ, పల్లకి సేవ, భజనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం స్వామి వారి కొండకు మెట్లు వేయించిన దాతలకు గ్రామ పెద్దలు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. సర్పంచి అంజినయ్య, గ్రామపెద్దలు లక్ష్మన్న, ఈరన్న ఆచారి, అహోబిలం, మాజీ సర్పంచి కృష్ణ, చిట్టెన్న, జగన్నాథ్ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి : సిఐటియు

ప్రజాశక్తి - నందవరం

ఈనెల 6న విజయవాడలో జరిగే మహా ధర్నాకు ఆశా వర్కర్లు తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు కోరారు. మంగళవారం ఆశా డే సందర్భంగా హాలహర్వి ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. ఇతర ఉద్యోగులు మాదిరిగా శ్రామిక మహిళలకు పిఆర్‌సి, ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ఎ, టిఎ, డిఎలు ఇవ్వకుండా ఆశాలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు ఇష్టానుసారంగా డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం జిఒలు నేటికీ అమలు కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలు, పింఛను జీతంలో సగం ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 6న జరిగే చలో విజయవాడ మహా ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం పిఎస్‌సి డాక్టర్ విజయభారతికి వినతిపత్రం అందజేశారు. ఆశాలు రోజా, రమణి, సుశీల, శారద, జ్యోతి, ఈరమ్మ, సుజాత, నాగవేణి, పరిమళ, శిరీష, రామాంజనమ్మ, హరిత, మా దేవి పాల్గొన్నారు. **హోళగుంద** మండలం గజ్జహళ్లి పిహెచ్‌సిలో వైద్యులు న్యూటన్, రాధమ్మకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, ఆశాలు సలోమి, మహాలక్ష్మి, ఫాతిమా, శ్వేత, సిద్ధలింగమ్మ, బసమ్మ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దతుంబలం పిహెచ్‌సిఒలో మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లావణ్య, సుకన్య మాట్లాడారు. నరసమ్మ, విశాల లక్ష్మి, రాఘవేంద్రమ్మ, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, తులసి పాల్గొన్నారు. **ఆస్పరి** ప్రభుత్వాస్పత్రి ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం డాక్టర్ రఘురాం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, భువనేశ్వరి, ఆశాలు రాజేశ్వరి, మహేశ్వరి, రైతు సంఘం నాయకులు రంగస్వామి, ఈరన్న పాల్గొన్నారు.

నందవరంలో మాట్లాడుతున్న రాముడు

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ఆరేళ్ల పిల్లలకు ఆధార్ తప్పనిసరి

- ఎంపిడిఒ అల్లా బకాష్, సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆరేళ్లు నిండిన పిల్లలకు ఆధార్ తప్పనిసరిగా చేయించాలని ఎంపిడిఒ అల్లాబకాష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో అంగన్వాడీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులను చిప్పగిరి, బిల్డోన సచివాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. పిల్లలకు ఆధార్ చేయించేందుకు ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని సూచించాలని తెలిపారు. ఈ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిగత మురుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ అల్లా బకాష్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో వ్యక్తిగత మురుగుదొడ్లకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజలు నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను సకాలంలో చేయలేని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వేలలో అధికారులు అలసత్వం వహించకుండా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసి మండలాన్ని మొదటి వరుసలో నిలపాలన్నారు. మురుగునీరు ఉన్న వీధి చివరన ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సుధీర్, జయరాం నాయక్, నరేంద్ర, సిసింద్రీ, సురేంద్ర, ప్రమీల, నరసింహులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చిన నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజల దాహం తీర్చేందుకు జనసేన నాయకులు ముందుంటారని జనసేన సీనియర్ నాయకులు సోమశేఖర్ తెలిపారు. మంగళవారం మండలంలోని తొగలగల్లు గ్రామంలో వెలసిన శ్రీఓబులేశ్వరస్వామి జాతరలో ప్రజలు నీటికోసం కష్టాలు పడకుండా జనసేన ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి జనసేన సీనియర్ నాయకులు సోమశేఖర్ రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శులు జగన్, మహేష్, వీరేష్, మహదేవ్, హనుమేష్, వీరేంద్ర, మోహన్, కృష్ణ, రాము, కుబేర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక.. గంజిహళ్లి దర్గా...

- నేటి నుంచి గంజిహళ్లి బడేసాహెబ్ ఉరుసు ఉత్సవాలు
- లక్షల్లో తరలిరానున్న భక్తులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గంజిహళ్లి గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన మహాత్మ శ్రీగంజిహళ్లి బడేసాహెబ్ 331వ ఉరుసు మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గంధం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమై ఈనెల 6న ఉరుసు, 7న జియారత్ కార్యక్రమంతో ముగుస్తాయని దర్గా ధర్మకర్త ఆర్.కుబేర రెడ్డి, పీఠాధిపతులు పెద్ద బడేసాహెబ్, దర్గా హసన్, తాత ముని మనవడు, దర్గా డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు, ఎలక్ట్రికల్ ఇంజినీర్ సయ్యద్ చిన్నముద్గోల్ మంగళవారం తెలిపారు. ఈ ఉరుసుకు జిల్లా నలుమూలల నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు. కులమతాలకతీతంగా బడేసాహెబ్ ఆ కాలంలోనే ప్రజల్లో మత సామరస్యాన్ని నెలకొల్పారని గ్రామస్తులు చెబుతారు.

నేటికీ కట్టుబాట్లు పాటిస్తున్న గ్రామస్తులు : గ్రామంలోని ప్రజలు బడే సాహెబ్ తాత ఆజ్ఞ మేరకు కొన్ని కట్టుబాట్లను పాటించేవారని గ్రామ పెద్దలు చెబుతారు. గ్రామంలో పాలు, పెరుగు అమ్మ రాదు, ఉచితంగానే అందజేయాలి. రైతులు చెరుకు పండించ రాదు. గ్రామంలో గోవధ నిషేధం. ఈ కట్టుబాట్లను తమ తాత, తండ్రుల నుంచి నేటి వరకు పాటిస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

భారీ బందోబస్తు : సిఐ ఎ.గంగాధర్

గంజిహళ్లి ఉరుసు మహోత్సవం సందర్భంగా గ్రామంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా 150 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. లక్ష మందికిపైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు పోలీసుల సూచనలు, జాగ్రత్తలు పాటించి, రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలకు గురికాకుండా, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా సహకరించాలని కోరారు. దర్గా పరిసరాల్లో మద్యం అమ్మకాలు, జూదం, లక్కీ గేమ్స్ లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజిహళ్లి బడే సాహెబ్ దర్గా

అన్ని ఏర్పాట్లూ సిద్ధం : సయ్యద్ చిన్న ముద్గోల్

దర్గా డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం, గ్రామంలో ఆరోగ్య శిబిరాల ఏర్పాటు లాంటి సేవా కార్యక్రమాలే కాకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలూ కల్పించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు, ఎలక్ట్రికల్ ఇంజినీర్ సయ్యద్ చిన్న ముద్గోల్ తెలిపారు. ప్రజలకు రవాణా ఇబ్బంది లేకుండా ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో నుంచి 20కి పైగా బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15 ట్యాంకర్లతో నీటి వసతి, గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాల వైద్య సిబ్బంది సహకారంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా ఆర్‌డిఎస్ఎస్ స్కీం కింద గంజిహళ్లి గ్రామంలో 24 గంటలు విద్యుత్ ఉండే విధంగా జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.ఉమాపతి సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎస్ఇకి గ్రామస్తులు, దర్గా ధర్మకర్త, పీఠాధిపతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి మహర్షి మందిరం ముస్తాబు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో వాల్మీకి మహర్షి మందిరం ప్రారంభానికి ముస్తాబైందని గ్రామపెద్దలు సోమవారం తెలిపారు. మందిరం నిర్మాణ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈనెల 8న గంగ పూజ, గోపూజ, మండప ధ్వజారోహణ, గణపతి హోమం, మహా మంగళ హారతి, 9న ఉదయం పంచ కలశ పూజ, నవగ్రహ పూజ, మృత్యుంజయ పూజ, వాల్మీకి మహర్షికి అభిషేకం, సాయంత్రం నవగ్రహ హోమం, రుద్ర హోమం, 10న వాల్మీకి మహర్షికి విశేష అభిషేకం, అలంకారం, జహది హోమం అనంతరం ఉదయం 10.15 నుంచి 11.05 గంటలకు వాల్మీకి మహర్షి నూతన శిల విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన ఉంటుందని తెలిపారు. వాల్మీకి కుటుంబ సభ్యులు విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనాలని కోరారు.

హద్దులకు భంగం కలుగకుండా చూడాలి

- కమిషనర్‌కు వైసిపి వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని కుర్ని శ్మశానవాటిక పక్కనున్న రస్తా, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టే దశలో భాగంగా శ్మశాన వాటిక స్థలం హద్దులకు భంగం కలుగకుండా చూడాలని వైసిపి నాయకులు కోరారు. మంగళవారం వైసిపి పట్టణ అధ్యక్షులు నాగశేషప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వైకె.శివప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని కుర్ని శ్మశాన వాటిక భూమి (సర్వే నెంబర్లు 101-ఎ-3, 101-బి-3, 101-సి-3, 53-ఎ, బిలో గల శ్మశాన భూమి) హద్దులు దాటి డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకుండా, శ్మశాన వాటిక భూమిలో పనులు జరగకుండా, తమ సమక్షంలోనే పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ అధికారులు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని శ్మశాన వాటిక హద్దులను పరిరక్షిస్తూ పనులు చేపడతారని ఆకాంక్షించారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) :: ADONI.
I.P. NO- 13 /2018

Between:
Ontela Lalappa. ...Petitioner
Vs
Somi Reddy and 15 others. ...Respondents

GENERAL NOTICE

The above-named Petitioner has filed the above case for Insolvency petition. Hence, if anybody has got any objection with regard to the above petition, you are hereby directed to appear in person or through your pleader on date 26/03/2025 at 10:30 A.M., and file the objections if any, otherwise the petition will be decided on merits.

Sd/T. MADHU SUDAN,
Advocate,
Adoni.